సాక్షి కర్నూలు

బుధవారం, 6, సెప్టెంబర్, 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణం లోని నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్రపాలకుడు శ్రీబయలువీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా విశేషపూజలు నిర్వహించారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఎమ్మిగనూరుకు చెందిన డి.సత్యనారాయణస్వామి రూ.1,00,116 విరాళంగా అందజేశారు.



కేసీకి నీరు విడుదల

గూడూరు: సుంకేసుల జలాశయం నుంచి మంగళవారం కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో 0.581 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

న్యూస్‌రీల్

గర్భిణులకు ఉచితంగా టిఫా స్కానింగ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కో ఆర్డినేటర్ హేమలత

కర్నూలు(హాస్పిటల్): గర్భంలో ఉన్న శిశువు లోపాలను గుర్తించేందుకు గర్భిణీలకు ఉచితంగా టిఫా స్కానింగ్ చేయిస్తున్నట్లు రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం జిల్లా కో ఆర్డినేటర్ హేమలత తెలిపారు. మంగళవారం స్థానిక జొహరాపురంలోని యుపీహెచ్‌సీలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలకు ఆశా డే సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుంచి ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా చిన్నారులు జన్మించేంత వరకు వారి లోపాలు బయటపడటం లేదన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం ఉచితంగా టిఫా స్కాన్ చేయించేందుకు నిర్ణయించిందన్నారు. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ఆమెకు అందుతున్న వైద్యసేవలు, పరీక్షలు, టీకాల వివరాలను ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆశా కార్యకర్తలు గర్భిణీలు, బాలింతల ఇళ్లకు వెళ్లినప్పుడు వారు తీసుకోవాల్సిన పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, టీకాల గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

కర్నూలు (టౌన్) : ఈనెల 9 వ తేదీ ఉదయం 10 గంటలకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మండలాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ జి. రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెలిఫోన్ బిల్లులు బకాయి ఉన్న వినియోగదారులు కోర్టు వద్దకు వచ్చి పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు. జిల్లా, మండల న్యాయ సేవాధికారి కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు, డోన్, కోవెలకుంట్ల, బనగానపల్లె, ఎమ్మిగనూరు, ఆదోని, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, నందికొట్కూర్, పత్తికొండ పరిధిలోని లోక్ అదాలత్ కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాత బకాయిలను ముందుగానే చెల్లించిన వినియోగదారులు తమ దగ్గరలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. వివరాలకు 08518-220721 టెలిఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఈరన్న హుండీ కానుకల లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. ఆలయ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో కాలక్షేపవు మండపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు స్వామి వారికి నగదు రూ.79,75,355, వెండి 13.250 కిలోలు, బంగారం 15 గ్రాములు సమర్పించారు. ఆదోని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, ట్రస్టుబోర్డు డైరెక్టర్లు వెవెంకోబ, మల్లికార్జున, దేవాలయ సిబ్బందితో పాటు ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, ఉప ప్రధాన అర్చకుడు మహదేవస్వామి, ఆలయ పర్యవేక్షకులు రామ్మోహన్‌రావు, వెంకటేష్, మల్లికార్జున, ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, ఆలయ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

15లోపు ఈక్రాప్ బుకింగ్ పూర్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఖరీఫ్‌లో అన్నదాతలు సాగు చేసిన పంటల ఈక్రాప్ బుకింగ్‌ను ఈనెల 15లోపు పూర్తి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో వీఏఏ అథంటిఫికేషన్ చేసిన వాటిని వీఆర్వోల లాగిన్‌లో పరిశీలన చేయాలన్నారు. మంగళవారం సాయంత్రం ఆమె కలెక్టరేట్ నుంచి మండలాధికారులతో అభివృద్ధి, సంక్షేమపథకాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈనెల 17వ తేదీన ప్రారంభం కానున్న ప్రధానమంత్రి విశ్వకర్మకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ అప్పలకొండతోపాట వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సి.బెళగల్ మండలం కొత్తకోట గ్రామంలో సాగవుతున్న ఆయిల్‌పామ్



పంటలో కొత్తధనం

ఆయిల్‌పామ్ సాగుకు శ్రీకారం

- జిల్లా వాతావరణ పరిస్థితులు, గాలిలో తేమ అనుకూలం
- 13 మండలాల్లో సాగుకు అనుమతి
- మూడు కంపెనీలను కేటాయిస్తూ నోటిఫికేషన్
- 3,051 హెక్టార్లలో సాగు చేపట్టేందుకు అవకాశం
- సి.బెళగల్ మండలం కొత్తకోటలో 15 ఎకరాల్లో మొదలైన సాగు



ఆయిల్‌పామ్ సాగుపై అధ్యయనం చేస్తున్న రైతులు, ఉద్యాన అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): కరువు నేలలో సిరుల పంటలు పండుతున్నాయి. ఇప్పటికే ఖర్జూర, వక్క పంటల సాగులో రైతులు రాణిస్తుండగా.. ఇప్పుడు ఆయిల్‌పామ్ కూడా తోడైంది. కోస్తా జిల్లాలకే పరిమితమైన ఈ సాగు జిల్లాలో కూడా రైతులను ఆకర్షిస్తోంది. వంట నూనెల కొరతను అధిగమించేందుకు దేశీయంగా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు అత్యధికంగా పామోలిన్ ఆయిల్‌నే వినియోగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పామోలిన్ ఆయిల్ కోసం విదేశాలపై ఆధారపడకుండా దేశీయంగానే సాగును పెద్ద ఎత్తున చేపట్టాలని నిర్ణయించడం విశేషం. జిల్లా ఉద్యాన అధికారులు 13 మండలాల్లో ఆయిల్‌పామ్ సాగుకు అవకాశం ఉందని(ఫీజుబులిటీ) ప్రభుత్వానికి నివేదించారు. నీటిపారుదల, బోర్లను పరిగణలోకి తీసుకొని 3,051 హెక్టార్లలో సాగు చేపట్టవచ్చని తేల్చారు. ఆ మేరకు 13 మండలాల్లోని 47 గ్రామాల్లో సాగుకు అవకాశం ఉన్నట్లు స్పష్టమవుతోంది. 2015-16 నుంచి 2019-20 వరకు వర్షపాతం వివరాలు, నెలవారీగా గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు, మండలాల వారీగా ఆయిల్‌పామ్ సాగుకు ఉన్న అవకాశాలను జిల్లా ఉద్యాన శాఖ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. జిల్లాలో సాగును ప్రోత్సహించేందుకు మూడు కంపెనీలు ముందుకొచ్చాయి.

సాగు ప్రక్రియ

- వరి సాగు ఉన్న అన్ని ప్రాంతాలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలమని ఉద్యానశాఖ అభిప్రాయపడుతోంది.
- ఏడాది పొడవునా నీటి అవసరం ఉంటుంది.
- గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉండాలి.
- ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన తర్వాత నాలుగేళ్లకు మొదటి పంట వస్తుంది.
- హెక్టారుకు 143 మొక్కలు నాటుతారు.
- ఆయిల్‌పామ్ మొక్కలు ఎక్కడంటే అక్కడ దొరకవు.
- ఆయిల్‌పామ్ కంపెనీలే మొక్కలను సరఫరా చేయాల్సి ఉంది.
- పంట కోసిన 24 గంటల్లో ప్రాసెసింగ్ ప్రక్రియను చేపట్టాలి.
- జిల్లాలో ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ యూనిట్లు కూడా ఏర్పాటయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

నీటి సదుపాయంతో రాణింపు



తెలంగాణలో అధ్యయనం చేసి ఐదు ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నాం. ఎర్రవల్లి సమీపంలోని నర్సరీ నుంచి ఆయిల్ పామ్ మొక్కలు తెప్పించాం. ఒక మొక్క ధర రూ.250 చొప్పున హెక్టారుకు 143 మొక్కలు నాటడం పూర్తయింది. పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకున్నాం. మూడేళ్ల పాటు ఆయిల్‌పామ్‌లో అంతర పంటలు సాగు చేసుకోవచ్చు. ఈ పంట సాగుకు డ్రిప్ ఉంటే బాగా రాణించవచ్చు.

– బాలకృష్ణారెడ్డి, కొత్తకోట, సి.బెళగల్ మండలం

మండలం	సాగుకు అనుకూలమైన భూమి(హెక్టార్లలో)
ఆదోని	111
సీ.బెళగల్	246.20
గోనెగండ్ల	56.20
హొళగుంద	529.90
కోసిగి	312.30
కౌతాళం	677.70
కర్నూలు	114
మంత్రాలయం	120.40
నందవరం	402.5
పెద్దకడబూరు	191.90
ఎమ్మిగనూరు	219.60
హాలహర్వి	32.50
క్రిష్ణగిరి	37.70

ఆయిల్‌పామ్ సాగుకు నోటిఫికేషన్ జారీ

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు కొందరు రైతులు శ్రీకారం చుట్టారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో సాగు చేసిన ఆయిల్‌పామ్‌ను అధ్యయనం చేసిన మీదట రైతులు సాగుకు సిద్ధమయ్యారు. సీ.బెళగల్ మండలం కొత్తకోట గ్రామంలో ముగ్గురు రైతులు 15 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం, కల్లూరు తదితర మండలాల్లో ఆయిల్‌పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎర్రవల్లిలోని ఫామ్ నుంచి మొక్కలు తెప్పిస్తున్నారు. రాయలసీమ జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగుకు అవకాశం ఉందని ఉద్యాన శాఖ ఫిజుబులిటీ ఇవ్వడంతో అనుమతి ఇస్తూ ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం.43 జారీ చేసింది. మండలాల వారీగా ఆయిల్‌పామ్ కంపెనీలను కేటాయిస్తూ నోటిఫికేషన్ విడుదలైంది.

కంపెనీ	కేటాయించిన మండలాలు
పతంజలి ఫుడ్స్ లిమిటెడ్	సి.బెళగల్, గోనెగండ్ల
నవ భారత్ లిమిటెడ్	ఆదోని, క్రిష్ణగిరి, కర్నూలు, ఎమ్మిగనూరు
లివింగ్ ఫుడ్స్	హాలహర్వి, హొళగొంద, పెద్దకడబూరు, కోసిగి, నందవరం, కౌతాళం, మంత్రాలయం

ప్రత్యేక బృందంతో అధ్యయనం

రాయలసీమ జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగుకు ఉన్న అవకాశాలను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు 2021లో ప్రత్యేక టీం పర్యటించింది. ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్, కర్నూలు ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి ఆధ్వర్యంలో డైరెక్టర్ రీసెర్చ్ ఎం.తిరుపతిరెడ్డి, హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ ప్రిన్స్‌పల్ సైంటిస్ట్ విజయరాయిలతో కూడిన బృందం రాయలసీమ జిల్లాల్లో పర్యటించి భౌగోళిక పరిస్థితులు, వాతావరణ పరిస్థితులు, వర్షపాతం వివరాలు, నీటిపారుదల పరిస్థితులు తదితరాలతో పాటు రైతుల అభిప్రాయాలు కూడా తెలుసుకున్నారు. అన్ని అంశాలు పరిశీలించిన తర్వాత జిల్లాలో ఆయిల్ పామ్‌కు అవకాశాలు ఉన్నాయని ఈ బృందం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది.

సాగుకు అనుకూలం



జిల్లా వాతావరణ పరిస్థితులు, గాలిలో తేమ శాతం, ఉష్ణోగ్రతలు, నీటిపారుదల సదుపాయాలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలం. 13 మండలాల్లోని 47 గ్రామాల పరిధిలో 3,051 హెక్టార్లు సాగుకు అనుకూలమని ప్రభుత్వానికి నివేదిక పంపగా అనుమతులు మంజూరయ్యాయి. ఇప్పటికే సి.బెళగల్ మండలంలో ఆయిల్‌పామ్ సాగు కొనసాగుతోంది. మొక్కలు నాటిన 4వ ఏడాది నుంచి పంట వస్తుంది.

– పి.రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు

డీఆర్‌ఓగా కె.మధుసూదన్‌రావు



కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో)గా కె.మధుసూదన్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురంలోని హెచ్‌పీసీఎల్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన్ను కర్నూలు డీఆర్వోగా నియమించారు. ఇక్కడ డీఆర్వోగా పనిచేస్తున్న నాగేశ్వరరావును బదిలీ చేసి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. కాగా మధుసూదన్‌రావు గతంలో అనంతపురం జిల్లా కలెక్టరేట్ ఏఓగా, వైఎస్ఆర్ కడప జిల్లాలో కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేశారు. ఇదిలాఉంటే ఐసీడీఎస్‌లో పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న పి.రోహిణిని కర్నూలు జిల్లా రీజినల్ జాయింట్ డైరెక్టర్‌గా నియమించారు.

క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డిప్యుటేషన్ రద్దు

కర్నూలు(సిటీ): క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ డి.శ్రీనివాసులు డిప్యుటేషన్ గడువు పూర్తయ్యింది. ఈయన ఎస్వీ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేసేవారు. రెండు సంవత్సరాల క్రితం డిప్యుటేషన్‌పై క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా వచ్చారు. డిప్యుటేషన్ గడువు పూర్తి కావడంతో మరో ఏడాది ఏడాది పొడిగించాలని ఈ ఏడాది జూన్ 6వ తేదీన వర్సిటీ అధికారులు ఉన్నత విద్యామండలికి ప్రతిపాదనలు పంపారు. దీనిని తిరస్కరిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే రిజిస్ట్రార్‌ను రిలీవ్ చేయాలని వర్సిటీ వీసీ సాయిగోపాల్‌కు ఆదేశాలు జారీ చేశారు.

బంగారు భవిష్యత్తుకు ఉపాధ్యాయులే మార్గనిర్దేశకులు

- ఘనంగా గురుపూజోత్సవం
- 65 మందికి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



కర్నూలు సిటీ: ఉపాధ్యాయులు భావి భారత పౌరుల బంగారు భవిష్యత్తుకు మార్గ నిర్దేశకులని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నారపరెడ్డి మౌర్య అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన గురు పూజోత్సవం కార్యక్రమంలో జిల్లా జెడ్పీ చైర్మన్, కలెక్టర్‌తో పాటు సీఈఓ జి.నాసర రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఏ.హఫీజ్‌ఖాన్, మేయర్ బి.వై రామయ్య, డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి, సమగ్ర శిక్ష అదనపు కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్ పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులను దైవంగా భావిస్తారని.. తల్లిదండ్రుల తర్వాత విద్యార్థులను సరైన మార్గంలో నడిపే బాధ్యత వాళ్లపైనే ఉందన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రమ శిక్షణ, నైతిక విలువలను బోధించాలన్నారు.

- మెరుగైన సమాజాన్ని తయారు చేయగల సామర్థ్యం టీచర్లకు మాత్రమే ఉందని, విద్యార్థులు గురువుల మాటలను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు.
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో గురువుల స్థానం చాలా గొప్పదన్నారు. ఆ రోజుల్లో భయం, భక్తి అనేవి ఉండేవని, కానీ ఈ రోజు టీచర్ కొట్టారంటే తప్పు అవుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఎంతో కష్టపడి చదివి టీచర్ ఉద్యోగం తెచ్చుకుంటారని, కానీ టీచర్ అయ్యాక కూడా అంతే కష్టపడి చదువు నేర్పించాలన్నారు.
- ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ సమాజంలో గురువుల పాత్ర కీలకమైందని, సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఇస్తున్న ప్రాధాన్యతతో ఈ రోజు సర్కార్ స్కూళ్లు సరికొత్త రూపును సంతరించుకున్నాయన్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు.



మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి, ఎమ్మెల్యేలు కాటసాని, హఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్య



గురుపూజోత్సవ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు

గురువు లేని మనుషులు ఉండరు

గురువు లేని మనిషి అంటూ ఉండరని కర్నూలు నగరపాలక సంస్థ మేయర్ బి.వై రామయ్య అన్నారు. పేదరికం పోవాలంటే చదువుతోనే సాధ్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలను కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా తీర్చిదిద్దుతోందన్నారు. గురు పూజోత్సవంలో 65 మంది ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు డిప్యూటీ డీఈఓ హనుమంతరావు, డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ వసుంధరా దేవి, డీఈఓ ఆఫీస్ ఏడీ శ్యామూల్ పాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరో నాలుగైదు రోజులు వర్షాలే!

కర్నూలు(అగ్రికల్చర్): బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ఏర్పడటం, రుతుపవనాలు చురుగ్గా ఉండటంతో రానున్న రానున్న నాలుగైదు రోజుల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. హొళగుందలో అత్యధికంగా 37.4 మి.మీ వర్షం కురిసింది. గోనెగండ్ల, పత్తికొండ, నందవరం, ఎమ్మిగనూరు, హాలహర్వి, ఆదో ని, క్రిష్ణగిరి తదితర మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తం మీద సగటున 7.5 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో సాగు విస్తీర్ణం కూడా పెరుగుతోంది. ఉల్లి, మిర్చి, వాముతో పాటు వివిధ పంటల సాగు ఊపందుకుంటోంది. ఖరీఫ్ సాధారణ సాగు 4.21 లక్షల హెక్టార్లు ఉండగా.. ఈ నెల 5వ తేదీ నాటికి 3,23,878 హెక్టార్లలో పంటలు సాగవడం విశేషం.

18 మందికి ఈఓఆర్‌డీలుగా పదోన్నతి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ్రేడ్- 1 పంచాయతీ కార్యదర్శులు, సీనియర్ సహాయకులు 18 మందికి ఈఓఆర్‌డీలుగా పదోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్ కమిషనరేట్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 1న అర్హులై న ఈఓఆర్‌డీ, సూపరింటెండెంట్లకు ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం వెనువెంటనే గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు, సీనియర్ సహాయకులకు పదోన్నతులను కల్పించడం విశేషం. కా గా ఈఓఆర్డీలుగా పదోన్నతి పొందిన వారిలో మహిళలను కర్నూలు,నంద్యాల జిల్లాలకు కేటాయించి పురుషులను ఇతర జిల్లాలకు బదిలీ చేసినట్లు తెలిసింది.

పదోన్నతి పొందిన గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు

కృష్ణకుమార్(ఆలూరు), జయరాం(ముగితి), శ్రీహరి(మద్దికెర), అనురాధ(పాణ్యం), సుదర్శన్ రావు(చాగలమర్రి), ఆర్.శ్రీనివాసులు(కానాల), సులోచన(వెలుగోడు), రంగనాయకులు(గోనెగండ్ల), ఈశ్వరన్న(చిన్నమల్కాపురం).

పదోన్నతి పొందిన సీనియర్ సహాయకులు

ఎం.కృష్ణారెడ్డి, అనంతసేన, మధుమోహన చక్రవర్తి, శ్రీనివాస శర్మ, రాఘవేంద్రరాజు, మహేశ్వరరెడ్డి, నాగరాజస్వామి, నాగేంద్ర కుమార్, మధులత.

• చేను పులకింత.. చెరువు తుళ్లింత!





ఆకాశానికి చిల్లు పడినట్లు వర్షం కురుస్తోంది. వాతావరణం మబ్బులు కమ్ముకొని చల్లని గాలులు పైరును ముద్దాడుతున్నాయి. ప్రకృతి పరవశించి పాడుతుంటే.. వాగులు, వంకలు ఏకమై పారుతున్నాయి. మంగళవారం నగర శివారు గార్గేయపురం వద్ద నేలతల్లి వర్షంలో స్నానమాడుతుంటే.. చెరువు నీరు మొరవపోతున్న దృశ్యాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేశాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

క్లుప్తంగా

పీఆర్‌లో పదోన్నతులు



ఉత్తర్వులు అందించిన జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ పరిధిలోని జిల్లా పరిషత్, మండల పరిషత్, జెడ్పీ ఉన్నత పాఠశాల, పీఆర్, పీఐయూ ఇంజనీరింగ్ విభాగాల్లో ఆఫీస్ సబార్డినేట్లు(వాచ్‌మెన్, స్వీపర్లు)గా విధులు నిర్వహిస్తున్న 13 మందికి రికార్డు అసిస్టెంట్, ల్యాబ్ అసిస్టెంట్, లైబ్రరీ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించాయి. ఈ నేపథ్యంలో మంగళవారం స్థానిక జెడ్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి పదోన్నతులు పొందిన వారికి పోస్టింగ్ ఉత్తర్వులను అందించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి, కార్యాలయ పర్యవేక్షకులు మురళీమోహన్‌రెడ్డి, బసవశేఖర్ పాల్గొన్నారు. అర్హత కలిగిన ఆఫీసు సబార్డినేట్లకు పదోన్నతులు కల్పించి పోస్టింగులు ఇవ్వడం పట్ల పీఆర్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు లచ్చన్న, మధు వెంకటేశ్వరరావు తదితరులు జెడ్పీ చైర్మన్, సీఈఓ, డిప్యూటీ సీఈఓకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు

మహానంది: మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామని ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మహానందిలోని చైర్మన్ కార్యాలయంలో మంగళవారం ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం లోపలి కోనేరు వద్ద మహిళా భక్తులు వస్త్రాలు మార్చుకునేందుకు ఏర్పాట్లు వేగవంతంగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కోనేరులకు నూతన మెట్ల నిర్మాణంపై స్థపతులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. భక్తులకు అందించే లడ్డూ, వడప్రసాదాల ధరల పెంపుపై కమిటీ వేసి తయారీ, విక్రయాలకు సంబంధించిన ఆదాయ, వ్యయాలపై పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని ధర్మకర్తల మండలి సభ్యులు తీర్మానించారు. ఆలయం ముందు ఉన్న నవదుర్గలు, నవవినాయకులతో పాటు రథశాల షట్టర్‌కు పెయింటింగ్ పనులు చేయిస్తామన్నారు.దేవస్థానం పరిధిలో అనువైన ప్రదేశాలలో భక్తుల సౌకర్యార్థం పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని ధర్మకర్త హేమలత విజ్ఞప్తి చేయగా తగిన చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. సమావేశంలో ఆలయ ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ధర్మకర్తలు రామతుల శమ్మ, హేమలత, పార్వతమ్మ, లక్ష్మీదేవి, గంగిశెట్టి మల్లికార్జున, వీరభద్రుడు, బుసకాని వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, సిబ్బంది పాల్గొన్నారు.



రాజశేఖర్ రెడ్డి, పుల్లగుమ్మి జెడ్పీహెచ్ఎస్ | విజయ్‌భాస్కర్, ఎంపీపీఎస్, గోనెగండ్ల | జి. ఇంద్రావతి, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, కర్నూలు | అక్తార్ భాను,సిల్వర్ జూబ్లీ కాలేజీ, కర్నూలు | ఫామిదా బేగం, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ

రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీతలు

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం విశాఖ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా జిల్లా నుంచి ఆరుగురు ఈ అవార్డులు అందుకున్నారు. –కర్నూలు(సిటీ)



మంత్రి బొత్స చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న గూడూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ లెక్చరర్ కె.చంద్రశేఖర్

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



ఇన్‌చార్జ్ కలెక్టర్ మౌర్య నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న నందవరం ఎంఈఓ జె.సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, ఎమ్మెల్యేలు కాటసాని,హఫీజ్, మేయర్ రామయ్య

మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం గురుపూజోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు సత్కరించి జిల్లాస్థాయి పురస్కారాలు అందజేశారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



కె.వినోద్‌కుమార్, ఎంఈఓ-2, కర్నూలు | వి.శోభారాణి, ఎంఈఓ-2, కౌతాళం | ఆదాం బాషా,ఎంఈఓ-2, సి.బెళగల్ | సలావుద్దీన్, జీబేహాల్



ఎం.భీమన్న, కోటేకల్ | పి.రామచంద్రారెడ్డి, ఓర్వకల్లు | ఎం.రమ, పోలకల్ | హెచ్.రవికుమార్, నగరూరు | జి.కె.సునిత, దేవనకొండ | జి.చాముండేశ్వరి, చెరుకులపాడు | జి.పద్మావతి, ఆదోని | ఆర్.మౌలాలి, లక్ష్మాపురం | ఎస్.రాజశేఖరప్ప, గూడూరు | ఎం.మేరి సుమలత, బస్తిపాడు | ఆకుల రాజశేఖర్, వెల్దుర్తి | ఎల్.విజయలక్ష్మి, కర్నూలు

వి.రమణమూర్తి, పెద్దహరివాణం | బి.హన్నా సీమోన్, నన్నూరు | ఎం.శ్రీనివాసులు, గూడూరు | కె.రత్నకుమారి, ఎమ్మిగనూరు | కె.సుజన కుమారి, ఎమ్మిగనూరు | టి.ఫణీంద్ర, గూడూరు | పి.రాఘవయ్య, కర్నూలు | ఉమామహేశ్వర రెడ్డి, మిడివేముల | వి.వసంత, గూడూరు | ఎస్.నీలిమ, చిప్పగిరి | కె.గౌతమి, ఆస్పరి | ఎం.సలీం, లొద్దిపల్లె

సి.ప్రభాకర్ బాబు, బి.తాండ్రపాడు | జి.రమేష్, బి.తాండ్రపాడు | జి.శకుంతల, ఆదోని | ఆర్.సునిల్ కుమార్, కర్నూలు | హెచ్‌వై శేషాద్రి, వందగల్లు | ఎం.ఆదిమూర్తి, విరుపాపురం | బి.నాగేంద్ర, ములుగుందం | ఇ.వై.దాస్, కల్లూరు | కేజీ నవాజ్, వెల్దుర్తి | సీవీ నాగమణి, చిప్పగిరి | జి.వినూత, హోసూరు | ఎ.శకుంతల, ఆస్పరి

సర్వభూషణం, బల్లూరు | రాజాశెట్టి, నదిచాగి | ఎం.సుభ, గూడూరు | పి.నారాయణ స్వామి, పెరవలి | ఎం.జంబులింగయ్య, ఆలూరు | కె.అరుణశ్రీ, ఆలంకొండ | పర్వీన్ బేగం, కర్నూలు | డి.నాగన్న, చింతకుంట | ఐ.జె.అమలనాథన్, ఆదోని | షేక్ ఇబ్రహీం, కర్నూలు | ఎ.కె.నాగేశ్వరరావు, పెద్దమర్రివీడు | జె.రమేష్, కె.హొళగుంద

జోసెఫ్, సూదెపల్లి | వసుధా రాణి, బస్తిపాడు | గోవర్ధన్ రెడ్డి, ఎద్దులదొడ్డి | యశోదమ్మ, గూడూరు | శ్రీనివాస్ రెడ్డి, మొలగవెల్లి | సి.ఫహమీదబీ, మద్దికెర | ఎం.శారద, దిన్నెదేవరపాడు | ఎస్.వరలక్ష్మి, వెల్దుర్తి | ఇ.మహాలక్ష్మి, పత్తికొండ | నూర్ అహ్మద్ అరెకల్ | భరత్ రెడ్డి, రచ్చమర్రి | బి.నాగరాజు, తుమ్మలబీడు

ఎట్టకేలకు అడవిలోకి ఎలుగుబంటి



ప్రత్యేక వాహనం ద్వారా తీసుకెళ్లి అడవిలో వదిలిపెడుతున్న దృశ్యం

మహానంది: మహానంది క్షేత్ర పరిధిలో నాలుగు రోజులుగా అందరినీ భయభ్రాంతులకు గురిచేసిన ఎలుగుబంటిని అటవీశాఖ అధికారులు క్షేమంగా అడవిలో వదిలేశారు. సోమవారం రాత్రి మహానందిలోని పాడుబడిన గదిలోకి ఎలుగుబంటి వెళ్లిన విషయం తెలిసిందే. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగేంద్ర నాయక్ ఆధ్వర్యంలో డాక్టర్ జుబేర్, వైద్యుల పర్యవేక్షణలో ట్రాంక్‌లైజింగ్ ద్వారా మత్తు మందు ఇచ్చారు. అనంతరం నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్‌కు చెందిన వన్యప్రాణుల రక్షణ ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లి ముందుగా గాజులపల్లె ఆర్ఎస్‌లోని అటవీ డిపోలో ఉంచారు. అనంతరం అక్కడి నుంచి చలమ రేంజ్ పరిధిలోని అడవిలోకి తీసుకెళ్లి వదిలారు. డీఆర్ఓ హైమావతి, ఎఫ్ఎస్ఓలు రష్మీమణి, ఎల్లమ్మ, ఎఫ్‌బీఓ ప్రతాప్, రెస్క్యూటీం సభ్యులు ఉన్నారు.

చేతివృత్తుల బలోపేతమే విశ్వకర్మ యోజన లక్ష్యం

నంద్యాల(అర్బన్): గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ కుల వృత్తిదారులు, హస్త కళాకారుల వ్యాపార బలోపేతమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన లక్ష్యమని నంద్యాల జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాసయాదవ్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం పథకం అమలుకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీ అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17న ప్రారంభమయ్యే ఈ పథకంపై పెద్దఎత్తున అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయి నుంచి చర్యలు తీసుకోవాలన్నారు. 18 రకాల వృత్తి, హస్త కళాకారుల్లో లబ్ధిదారులను గుర్తించాల్సి ఉందన్నారు. లబ్ధిదారుల నమోదు ప్రక్రియపై వలంటీర్లకు శిక్షణ నివ్వాలని, నైపుణ్య కేంద్రాలనూ గుర్తించాలన్నారు. ఈ పథకానికి 18 రకాల చేతివృత్తిదారులు అర్హులని, వారికి సర్టిఫికేట్, గుర్తింపు కార్డు, రూ.3 లక్షల వరకు హామీ లేని రుణం, రూ.15 వేల విలువైన పనిముట్లు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. వడ్రంగి, పడవల తయారీ, కవచ తయారీ, కమ్మరవాడు కమ్మర, సాధనం పనిముట్లు, తాళాల తయా రీదారులు, శిల్పి, వెండి, బంగారం, మొదలైన లోహాలతో ఆభరణాలు చేయు స్వర్ణ శిల్పి, కుమ్మరి, చెప్పులు కుట్టు వాడు, తాపీ మేస్త్రీ, బుట్ట తయారీ, బొమ్మల తయారీ, పూలమాలలు అల్లేవారు, డాబా, దర్జీలు, చేపల వల తయారీ తదితర వృత్తుల వారిని గుర్తించాలన్నారు. వివరాలకు పద్మావతినగర్‌లోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తికి గాయాలు



అంబులెన్స్‌లో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

కోసిగి: ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారి పడి వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కోసిగి – కుప్పగల్ రైల్వే స్టేషన్ మధ్యలో సోమవారం అర్ధరాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. ఆధార్ కార్డు ,రైల్వే టికెట్ ఆధారంగా వివరాలు ఇలా.. క్షతగాత్రుడు కర్ణాటక రాష్ట్రం గదగ్ జిల్లా బటికెర గ్రామ వాసి. పేరు రాఘవేంద్ర గట్కారి. మంత్రాలయంలో జరుగుతున్న రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలను తిలకించేందుకు వచ్చిన ఆయన సోమవారం తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. రైలులో డోర్ దగ్గర కూర్చొని పయాణించే సమయంలో ప్రమాదవశాత్తు కిందకు పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో లేవలేక పట్టాల పక్కనే పడి ఉన్నాడు. మంగళవారం ఉదయం స్థానిక రైల్వే స్టేషన్ సిబ్బంది చూసి, రైతులు గమనించి 108 అంబులెన్స్‌లో కోసిగి ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వినాయక నిమజ్జనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

- వర్షాభావం నేపథ్యంలో చిన్న చిన్న మట్టి విగ్రహాలను పూజించాలి
- ఇప్పటి నుంచే నిమజ్జనోత్సవ విధులపై అధికారులు దృష్టి సారించాలి
- ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): ఈనెల 26వ తేదీన కర్నూలులో నిర్వహించే గణేష్ నిమజ్జనోత్సవానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. 18వ తేదీన వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గణేష్ నిమజ్జనం నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఇన్‌చార్జ్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలన్నారు. తీవ్ర వర్షభావ పరిస్థితుల నేపథ్యంలో కేసీ కెనాల్‌కు నీటి విడుదలపై సందిగ్ధత నెలకొందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని చిన్న చిన్న మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకుని పూజించాలని ఆమె భక్తులకు సూచించారు. పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ.. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనోత్సవాలు జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కర్నూలు వినాయక ఘాట్‌లో ఏడు భారీ క్రేన్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ మాట్లాడుతూ. వినాయక ఉత్సవాల విజయవంతానికి ఉత్సవ కమిటీ సభ్యులు తమకు సహకరించాలన్నారు. గణేష్ ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణన్న మాట్లాడుతూ.. హొళగుంద, గోనెగండ్ల మండల కేంద్రాల్లో నిమజ్జనోత్సవాలు జరుపుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కలెక్టర్, ఎస్పీలను కోరారు. కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖరరెడ్డి, ఆర్డీఓ హరిప్రసాద్, డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య, దేవదాయ శాఖ ఏసీ రామాంజనేయులు, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్యామల, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మట్టి మిద్దె కూలి వృద్ధురాలి మృతి



మృతి చెందిన వనం నాగమ్మ



కూలిన ఇంటి పైకప్పు

- మరొకరికి తీవ్ర గాయాలు
- కౌలురులో ఘటన

పాణ్యం: మట్టి మిద్దె కూలి ఓ వృద్ధురాలి మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని కౌలురు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వనం నాగమ్మ (70) అదే గ్రామంలో నివాసముంటున్న శివనాగమ్మ ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఇద్దరు కూర్చొని మాట్లాడుకుంటుండగా నాలుగు రోజులుగా కురుస్తున్న వానకు తడిసిపోయిన మిద్దె పైకప్పు ఒక్కసారిగా వారిపై కూలిపోయింది. గమనించిన స్థానికులు హుటాహుటిన వారిని మటిని తొలగించి బయటకు తీశారు. అప్పటికే వనం నాగమ్మ మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన శివ నాగమ్మను ఆటోలో శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. కాలక్షేపం కోసం స్నేహితురాలి ఇంటికి వచ్చిన వనం నాగమ్మ మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలికి ఆరుగురు కుమారులు, ఒక కుమార్తె సంతానం . కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెయ్య దూడల అభివృద్ధిపై అవగాహన కల్పించండి

- పశువైద్యులకు కర్నూలు డివిజన్ డీడీ దుర్గాప్రసన్నబాబు ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీడీ దుర్గా ప్రసన్న బాబు

కర్నూలు(అగ్రికల్చర్): పెయ్య దూడల అభివృద్ధిపై రైతులకు అవగాహన కల్పించాలని పశుసంవర్ధకశాఖ కర్నూలు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దుర్గాప్రసన్నబాబు వైద్యులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పశుసంవర్ధకశాఖ సమావేశ మందిరంలో కర్నూలు డివిజన్‌లో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వృత్తి నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారా పశుసంపదకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించవచ్చునన్నారు. లింగనిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భధారణ ద్వారా పాడిపశువుల్లో పెయ్య దూడలు పుట్టించుకోవచ్చని, దీనిని పెద్ద ఎత్తున రైతుల్లోకి తీసుకెళ్లాలన్నారు. పశుసంవర్ధక శాఖ ప్రాంతీయ శిక్షణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ ధనుంజయ పశువైద్యులకు టెక్నికల్ సెమినార్‌లో భాగంగా మాంసం ఉత్పత్తి, నాణ్యత ప్రమాణాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఏరియా వెటర్నరీ హాస్పిటల్స్ ఏడీలు రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, శివకుమార్, టెక్నికల్ ఏడీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు యూనివర్సిటీ పీఠాధిపతికి పదోన్నతి



ముసుగు శ్రీనివాసరావుకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పత్రం అందజేస్తున్న వీసీ

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చరిత్ర, సంస్కృతి, పురావస్తుశాస్త్ర పీఠంలో పీఠాధిపతి(డీన్)గా విధులు నిర్వహిస్తున్న ముసుగు శ్రీనివాసరావుకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించింది. మంగళవారం ఆయనకు విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ టి.కృష్ణారావు ఆయనకు పదోన్నతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ బి.రమేష్, రిజిస్ట్రార్ కొనకలూరి ఇనాక్, ఎక్స్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిరీక్షణ్ బాబు పాల్గొన్నారు.